



రాష్ట్ర హక్కుల కోసం పోరాడండి

పాలకపక్షాన్ని నిలదీయండి ● డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం



సమావేశంలో సీఎం, ఎంపీలు

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హక్కుల కోసం పార్లమెంటులో గట్టిగా పోరాడాలని, ఆర్థిక హక్కుల సాధన కోసం డీఎంకే ఎంపీలంతా సమష్టిగా నినదించాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం రాత్రి పార్టీ ఎంపీల సమావేశం తేనాంపేటలోని అన్నా అరివాలయంలో స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ సమావేశాల్లో కీలకమైన ప్రజా వ్యతిరేక బిల్లులను అడ్డుకోవడంతో పాటు, ప్రధానమైన అంశాలపై ఎలా వ్యవహరించాలనే విషయాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. పార్లమెంటు సమావేశాల్లో సహకార విశ్వవిద్యాలయాల ఏర్పాటు బిల్లు, పంజాబ్ కోర్టుల సవరణ బిల్లు, మారిటైమ్ సవరణ బిల్లు వంటి మొత్తం 15 బిల్లుల్ని ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాల్లో పార్లమెంటరీ జాయింట్ కమిటీ విచారణలో ఉన్న వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం, ఒకే దేశం ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులు ప్రతిపాదిస్తే తీవ్రంగా వ్యతిరేకించాలని, నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన సమగ్ర శిక్ష అభియాన్ నిధులు, పెండింగ్‌లో ఉన్న రైల్వే పథకాలకు నిధులను కేంద్రం విడుదల చేసేలా సభలో పాలకపక్షంపై తీవ్ర ఒత్తిడి తేవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రానికి కొత్త పథకాలు మంజూరుకు కూడా ప్రయత్నించాలన్నారు. మదురై ఎయిమ్స్, జీఎస్టీ బకాయిల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం, ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన నిధుల నిలిపివేత వంటి కీలకమైన అంశాలపై కూడా కేంద్రాన్ని నిలదీయాలని స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఎ.రాజా, కళానిధి వీరాసామి, జగద్రక్షకన్, దయానిధి మారన్, తిరుచ్చి శివా, కదిర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజకీయ వెలితి

● వాటిపైనే చర్చించాం
● రజనీతో భేటీ అనంతరం సీమాన్



చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ గతంలో ప్రకటించినట్లుగానే రాష్ట్రంలో మంచి పరిపాలకులు లేక ఇంకా రాజకీయ వెలితి కొనసాగుతూనే ఉందని, పుట్టగొడుగుల్లా రాజకీయ నేతలు పుట్టుకొస్తున్నారని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ తెలిపారు. గురువారం రాత్రి పోయెస్‌గార్డెన్‌లో రజనీకాంత్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అరగంటసేపు సమావేశమై రాష్ట్రంలో డీఎంకే పరిపాలన, విజయ్ రాజకీయ ప్రవేశం, 2026లో జరుగనున్న ఎన్నికలు గురించి ఇద్దరూ చర్చలు జరిపారు. వీరి భేటీ రాజకీయపరంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సీమాన్ మీడియాతో మాట్లాడుతూ... రజనీతో తాను రాజకీయాల కోసం చర్చించానని, ఈ నెల 8న తన జన్మదినం సందర్భంగా రజనీ నుంచి శుభాకాంక్షలు అందుకోవాలనుకున్నానని, ఆ సమయంలో రజనీకి షూటింగ్ వున్నందున కలుసుకోలేకపోయానని చెప్పారు. ఇప్పుడు ఆయన నగరానికి తిరిగి రావటంతో తనను ఆహ్వానించి శుభాకాంక్షలు చెప్పారని సీమాన్ వివరించారు. రజనీతో స్నేహపూర్వకమైన భేటీయే అయినా రాజకీయ, చిత్రసీమకు సంబంధించి వివిధ అంశాలపై మాట్లాడుకున్నట్టు తెలిపారు. రజనీ రాజకీయ ప్రవేశం చేయకుండా ప్రశాంతంగా సినిమాల్లో నటిస్తూ హాయిగా ఉంటున్నారని, తనకన్నా సీనియర్ నటుడని, కనుకనే ఆయన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తానని సీమాన్ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి స్టాలిన్ వియ్యంకుల్లా తరచూ కలుసుకుంటున్నారని, అయితే బయటికి బద్ధశత్రువుల్లా వ్యవహరిస్తున్నారని సీమాన్ విమర్శించారు.

సనాతనం వేరు.. దేవుడిపై నమ్మకం వేరు

● డీపీఐ అధినేత తిరుమావళవన్

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సనాతనం వేరు, దేవుడిపై నమ్మకం వేరని, దేవుడిపైన, మతంనపై విశ్వాసం సామాన్య ప్రజానీకర భావాలని, వాటిని గౌరవించడమే తమ ధ్యేయమని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన పళని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంపై శుక్రవారం మీనంబాక్కం విమానాశ్రయం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆలయాలు, మసీదులు సందర్శించమని కోరితే తాను వెళ్తుంటానని చెప్పారు. ఇదే విధంగా పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు ఆహ్వానించినా ఆలయాలకు వెళ్ళి వస్తుంటానని, అవన్నీ ప్రజలభావాలను గౌరవించడమే అవుతుందన్నారు. అందువల్ల ప్రత్యర్థుల విమర్శల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. సనాతనంలో విమర్శనాత్మక చర్యలనే తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ రీతిలోనే తాను పార్టీ విషయమై పళనికి వెళ్ళినప్పుడు కార్యకర్తల ఆహ్వానం మేరకే 30 యేళ్ల తర్వాత ఆ ఆలయానికి వెళ్ళి, స్వామివారికి పూజలు కూడా చేశానని, ఇందులో ఎలాంటి వైరుధ్యాలకు తావులేదని స్పష్టం చేశారు.

అంబేడ్కర్ పుస్తకావిష్కరణకు దూరం..

నగరంలో డిసెంబర్ 6న జరిగే అంబేడ్కర్ పుస్తకావిష్కరణ సభలో డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ పాల్గొనబోరని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. ఈ పుస్తకావిష్కరణ సభలో టీవీకే నేత విజయ్, డీపీఐ నేత తిరుమా పాల్గొంటారని ప్రసార మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. పుస్తకావిష్కరణ సభ రాజకీయ వేదికగా మారే అవకాశం ఉన్నందున తిరుమా ఆ సభలో పాల్గొనరని పేర్కొన్నారు.



చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతున్న తిరుమావళవన్

క్యారమ్స్ క్రీడాకారిణులకు ఘన స్వాగతం

అడయార్, నవంబరు 22: అమెరికాలో జరిగిన అంతర్జాతీయ క్యారమ్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన రాష్ట్రానికి చెందిన క్రీడాకారిణులు గురువారం రాత్రి నగరానికి చేరుకోగా, వారికి క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ పోటీల్లో రాష్ట్రం తరపున భారత జట్టులో చెన్నై క్రీడాకారులు కాసీమా, మిత్రా, నాగజ్యోతి పాల్గొన్నారు. మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత జట్టుకు బంగారు పతకం అందించారు. భారత జట్టులో సభ్యులైన ఈ ముగ్గురు క్రీడాకారులు కాలిఫోర్నియా నుంచి ఎయిరిండియా విమానంలో నగరానికి వచ్చారు. వీరికి తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థ (టీఎస్ఎస్‌డీఏ) ఉన్నతాధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఉపముఖ్యమంత్రి ఉదయనిధిని కలిసి ట్రోఫీలను చూపించగా, డిప్యూటీ సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు.



మంత్రి ఉదయనిధితో క్రీడాకారిణులు



ఏడేళ్ళ తర్వాత సూర్య చిత్రం ద్వారా శ్రియా రీఎంట్రీ

7

సూపర్‌స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది

● సత్యరాజ్

కోవైలో మత్తుమందుల విక్రయం

● పది మంది అరెస్టు



అరెస్టయిన దుండగులు

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నగరంలో కాలేజీ విద్యార్థులకు మత్తుమందు విక్రయించే ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగర పోలీసు కమిషనర్ బాలకృష్ణన్ ఆదేశాల మేరకు మత్తుమందు అమ్మే ముఠా ను పట్టుకునేందుకు వాహనాల తనిఖీ చేపట్టారు. నగరంలోని ఉక్కడమ్ వాగు ఫ్లై ఓవర్ వద్ద బైకులో వెళ్తున్న యువకుడిని ఆపి తనిఖీ చేయగా, అతడి వద్ద మత్తుమాత్రల ప్యాకెట్లు లభించాయి. వెంటనే ఆ యువకుడిని అరెస్టు చేశారు. ఆ యువకుడు ఇచ్చిన సమాచారం మేరకు మత్తుమాత్రల విక్రయ ముఠాలోని మదురై పేరయూరుకు చెందిన ప్రకాష్, మహమ్మద్ నవుఫల్ అలియాస్ కట్టదురై, ముజీబ్‌రహ్మాన్, రిజ్వాన్ సులైకల్, మహమ్మద్ సబీర్, మన్సూర్ రహ్మాన్, సనూఫ్, ముజీబుర్ రహ్మాన్, హనీస్ రహ్మాన్, సర్హాన్ అనే పదిమందిని అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి 500 మత్తు మాత్రలు, సూదులు, గంజాయి, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



పట్టాభిరామ్ వద్ద కొత్త టైడల్ పార్కును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పట్టాభిరామ్‌లో రూ.330 కోట్లతో టైడల్ పార్క్

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పట్టాభిరాంలో రూ.330 కోట్లతో నిర్మించిన టైడల్ పార్కును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అత్యాధునిక పారిశ్రామిక సదుపాయాలతో నిర్మించిన ఈ టైడల్ పార్కుకు ప్రారంభోత్సవం చేసి, వెబ్బరాక్స్ సొల్యూషన్స్, డాట్నిక్స్ టెక్నాలజీస్ ఎల్ఎల్‌పీ సంస్థలకు ఆ పార్కులో స్థలం కేటాయింపు పత్రాలను కూడా సీఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, ఎస్ఎం నాజర్, టీఆర్బీ రాజా, శాసనసభ్యులు టీజే గోవిందరాజన్, దురై చంద్రశేఖర్, ఎస్.చంద్రన్, వీజీ రాజేంద్రన్, ఎ.కృష్ణసామి, కె.గణపతి, జోసెఫ్‌సామువేల్, ఎస్.సుదర్శనం, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహ వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, టిడ్కో, టైడల్ పార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ డాక్టర్ డి.ప్రభుశంకర్, ఆవడి కార్పొరేషన్ కమిషనర్ ఎస్. కందసామి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సాంకేతిక కేంద్రం...

ఈ కార్యక్రమం అనంతరం కాంచీపురం జిల్లా తిరుముడివాక్కం సిడ్కో నగర్ పారిశ్రామిక వాడులో సూక్ష్మ, లఘు, మాధ్యమిక సంస్థ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో రూ.18.18 కోట్లతో నిర్మించిన నిర్దిష్ట ఇంజనీరింగ్, సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాన్ని కూడా స్టాలిన్ ప్రారంభించారు. ఈ కేంద్రంలో రూ.18.18 కోట్ల అంచనా వ్యయంతో రూ.13.33 కోట్ల సబ్సిడీతో డిజైన్ సెంటర్, రీ-ఇంజనీరింగ్ ల్యాబ్, అధునాతన శిక్షణ కేంద్రం తదితర సదుపాయాలను కల్పించినట్లు స్టాలిన్ తెలిపారు. చెన్నై పరిసర ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈ సంఘం ద్వారా ఏర్పాటైన ఈ కేంద్రంలో లభించే సేవలను రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలన్నీ పొందవచ్చన్నారు.

2025 ప్రభుత్వ సెలవులు

వేళచ్చేరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 2025వ సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం, 2025లో 23 రోజులు సెలవులున్నాయి. వాటిలో మూడు ఆదివారాలు కాగా, నవంబరులో ఒక్క సెలవు కూడా లేకపోవడం గమనార్హం. ఏప్రిల్ 1వ తేది బ్యాంక్ ఆడిటింగ్ రోజు సందర్భంగా జాతీయ, సహకార బ్యాంక్‌లకు మాత్రమే సెలవు దినం.

నెం	సెలవు రోజు	తేది	వారం
1	ఆంగ్ల సంవత్సరాది	01.01.2025	బుధవారం
2	సంక్రాంతి	14.01.2025	మంగళవారం
3	తిరువళ్లువర్ దినోత్సవం	15.01.2025	బుధవారం
4	ఉళవర్ తిరునాళ్	16.01.2025	గురువారం
5	గణతంత్ర దినోత్సవం	26.01.2025	ఆదివారం
6	తైపూసం	11.02.2025	గురువారం
7	తెలుగు సంవత్సరాది	30.03.2025	ఆదివారం
8	రంజాన్	31.03.2025	సోమవారం
9	బ్యాంక్ ఆడిటింగ్ డే	01.04.2025	మంగళవారం
10	మహావీర్ జయంతి	10.04.2025	గురువారం
11	తమిళ సంవత్సరాది/ డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి	14.04.2025	సోమవారం
12	గుడ్ ఫ్రైడే	18.04.2025	శుక్రవారం
13	మే డే	01.05.2025	గురువారం
14	బక్రీద్	07.06.2025	శనివారం
15	మొహర్రం	06.07.2025	ఆదివారం
16	స్వాతంత్ర్య దినోత్సవం	15.08.2025	శుక్రవారం
17	కృష్ణ జయంతి	16.08.2025	శనివారం
18	వినాయక చవితి	27.08.2025	బుధవారం
19	మిలాన్ ఉన్ నబి	05.09.2025	శుక్రవారం
20	ఆయుధ పూజ	01.10.2025	బుధవారం
21	విజయదశమి	01.10.2025	గురువారం
22	గాంధీ జయంతి	01.10.2025	గురువారం
23	దీపావళి	20.10.2025	సోమవారం
24	క్రిస్మస్	25.12.2025	గురువారం

ఆ కేసు కొట్టేయండి

● మంత్రి పిటిషన్
● కౌంటర్ దాఖలుకు కోర్టు ఆదేశం

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత 2008లో డీఎంకే ప్రభుత్వంలో నాటి ఐపీఎస్ అధికారి జాఫర్ సేట్ భార్యకు స్థలం కేటాయింపులో అక్రమాలు జరగ్గా, అప్పటి గృహ నిర్మాణ శాఖామంత్రి ఐ.పెరియస్వామిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఐ.పెరియస్వామి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ అంశంలో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు కోర్టు ఆదేశించింది. 2008లో జాఫర్ సేట్ భార్యకు తిరువాన్మియూరులో రెండు ఇళ్ళ స్థలాలను కేటాయించారు. కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయంటూ జాఫర్ సేట్, ఆయన సతీమణి ప్రవీణ్. కె.మురుగయ్య, కె.రాజమాణిక్యం, ఆర్.దుర్గా శంకర్ తదితరులపై ఏసీబీ అధికారులు 2013లో కేసు నమోదు చేశారు. అయితే, నాటి మంత్రి ఐ.పెరియస్వామి మినహా మిగిలినవారిపై సుప్రీంకోర్టు కేసు రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో జరుగుతోంది. ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేయగా, ఇది న్యాయమూర్తి వేల్‌మురుగన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి.. ఏసీబీ అధికారులను కౌంటర్ దాఖలు చేయాలని కోరుతూ తదుపరి విచారణను వచ్చే నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

రెడ్‌హిల్స్‌లో బ్యాంక్ దోపిడీయత్నం

● అలారం మోగటంతో చిక్కిన దొంగ



అరెస్టయిన సురేష్

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):నగర శివారు ప్రాంతమైన రెడ్‌హిల్స్ బైపాస్‌రోడ్డులో ఐవోబీలో దోపిడీ యత్నానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆ బ్యాంక్ వద్దకు వెళ్ళి బ్యాంక్ కిటికీ కమ్మీలను కోశాడు. అదే సమయంలో బ్యాంక్ అలారం మోగటంతో బ్యాంక్ మేనేజర్ వెంటనే పోలీసు కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేశారు. పోలీసులు వెంటనే ఆ బ్యాంక్ వద్దకు వెళ్ళి పరిశీలించగా కిటికీ కమ్మీలు కోసి ఉండటం గమనించారు. ఆ కమ్మీలను కోసిన దుండగులు పోలీసులను గమనించి బ్యాంక్ ఏటీఎం గదిలో దాక్కున్నాడు. పోలీసులు ఏటీఎం గదిలోకి వెళ్ళగా ఆ దుండగుడు పారిపోయేందుకు ప్రయత్నించగంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఆ వ్యక్తి ఆవడి వీరాపురం ప్రాంతానికి చెందిన సురేష్ (45)గా వెల్లడైంది. రెడ్‌హిల్స్ క్రైం విభాగం ఎస్ఐ లతామహేశ్వరి కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా సేలయూర్ పరిధిలోని మంగళా అపార్ట్ మెంట్స్, సృష్టి విల్లా, జేకేఎం కాలేజ్ రోడ్డు, జెయ్ వాటర్, కేకే నగర్, పెరుమాళ్‌పురం, శరవణ నగర్, కార్గిల్ అవెన్యూ, అయ్యనార్ అవెన్యూ, జోయల్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

'అన్నా' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి యేటా ధైర్యసాహసాలు ప్రదర్శించే వారిని ప్రోత్సహిస్తూ అన్నా పురస్కారం అందజేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు ఇలా మూడు విభాగాల్లో పురస్కారంతో పాటు రూ.లక్ష చెక్ అందజేయనున్నారు. ఆసక్తికలిగినవారు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి గణతంత్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి పురస్కారాలు ప్రదానంచేయనున్నారు.

నీలవేము కషాయం కోసం చందన కట్టెలు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నీలవేము కషాయం తయారీకి 5వేల కిలోల చందన కట్టెలను రాష్ట్ర మూలికా వృక్ష మండలి 'టామ్‌కాల్'కు అందించేందుకు అటవీ శాఖ అంగీకరించింది. రాష్ట్రంలో డెంగ్యూ, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టిన ప్రభు త్వం, ప్రజల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందించేలా నీలవేము కషాయం పంపిణీ చేస్తోంది. ఈ నీలవేము కషాయం తయారీకి వనమూలికలతో పాటు చందనం పొడి కూడా కలుపుతున్నారు. అందుకోసం టామ్‌కాల్ సంస్థ చందనం కట్టెలు కోరుతూ చేసిన దరఖాస్తు పరిశీలించిన అటవీ శాఖ, కిలో రూ.347 చొప్పున 5,000 కిలోల చందనం కట్టెలు కొనుగోలుకు అనుమతిచ్చింది. ఈ మేరకు అటవీ శాఖ కార్యదర్శి సెందిల్‌కుమార్ జీవో విడుదల చేశారు.

నేడు గ్రామసభలు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈశాన్య రుతుపవనాల విపత్తులు ఎదుర్కొనేలా చేపట్టాల్సిన చర్యలు, పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు సహా పలు అంశాలపై చర్చించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. గత నెల 31వ తేది దీపావళి పండుగ సందర్భంగా నవంబరు 1వ తేది ప్రభుత్వ సెలవు ప్రకటించడంతో, ఆ రోజు నిర్వహించాల్సిన గ్రామసభలు ఈ నెల 23వ తేది జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

నేటినుంచి 'నేచురల్ బజార్'

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నుంగంబాక్కంలోని అన్నై థెరిస్సా మహిళా ప్రాంగణంలో శని,ఆదివారాల్లో 'నేచురల్ బజార్' జరుగనుంది. ఇందులో వివిధ జిల్లాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు చేసిన వస్తువులతో కూడిన స్టాల్స్ ఏర్పాటయ్యాయి. రుచికరమైన ఆహార ఉత్పత్తులు కూడా విక్రయించనున్నారు. ఈ బజార్‌ను ప్రజలు సందర్శించి మహిళా స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

తిరువళ్లూర్‌లో కొత్త ఇండస్ట్రియల్ ఎస్టేట్

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో పెద్ద పరిశ్రమల కర్మాగారాలు అధికంగా ఉన్నాయి. ఈ జిల్లాల్లో స్థలాలు లభించడం కష్టతరం కాగా, దరలు కూడా అధికంగా ఉన్నాయి. దీంతో, వాహనాల విడిభాగాలు సహా పలు ఉత్పత్తులు తయారుచేసే సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు స్థలం లభించడం లేదు. అలాంటి సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా తమినాడు చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ (సిడ్కో), తిరువళ్లూర్ జిల్లా కొత్త బస్టాండ్ సమీపంలో కొత్త పారిశ్రామిక వాడ తయారీకి స్థలం గుర్తించింది. ప్రస్తుతం సిట్కో సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 8,600 ఎకరాల్లో 130 ఇండస్ట్రియల్ పార్క్ నిర్వహిస్తోంది.

నేడు, రేపు ఓటర్ల జాబితా ప్రత్యేక శిబిరాలు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శని, ఆదివారాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రత్యేక శిబిరాలు జరుగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 68,000 పోలింగ్ కేంద్రాల్లో జరిగే శిబిరాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో పేరు చేర్పు, తొలగింపు, చిరునామా, నియోజకవర్గం మార్పు తదితరాలకు 6,85,513 దరఖాస్తులు అందాయి. శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈసీ విజ్ఞప్తి చేసింది.

చెస్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియా చెస్ అకాడమీ, తమిళనాడు, చెంగల్పట్టు జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 5 నుంచి 8వ తేది వరకు అంతర్జాతీయ చెస్ పోటీలు నిర్వహించనున్నారు. మెప్పేడులోని సియోన్ ఆల్విన్ పాఠశాల ప్రాంగణంలో 8,10,12,14,18, వెటరన్స్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు సమారు రూ.3 లక్షల విలువైన బహుమతులు అందించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిఉన్న వారు 9444135579, 9043690467నెంబర్లకు సంప్రదించవచ్చు.

ఆనైకట్టు డివిజన్‌లో కలెక్టర్ పర్యటన



పశు వైద్య శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు డివిజన్‌లో శుక్రవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పర్యటించారు. ముత్తుకుమరన్ కొండ, గుండురాణి, పింజు మందై తదితర గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్, అక్కడ ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జార్కన్‌కొల్లై రేషన్ దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్ వస్తువలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, ఆదిద్రావిడ సంక్షేమ హాస్టల్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాఖ తరఫున రూ26 వేల వ్యవసాయ ఉపకారణాలను కలెక్టర్ రైతులకు అందజేశారు.

హెల్మెట్ ధరించిన వారికి బహుమతులు



వాహనచోదకులకు బహుమతులు అందజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వేలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. వాహన చోదకులు, వాహనం వెనుక కూర్చొనే వారు హెల్మెట్ ధరించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లాంగ్ బజార్‌లో గస్తీ తిరిగిన ట్రాఫిక్ పోలీసులు, ఆ సమయంలో హెల్మెట్‌తో వచ్చిన వాహనచోదకులకు బహుమతులు అందజేసి అభినందించారు.

మద్యం మత్తులో అత్యాచారాలు

● హైకోర్టు మాజీ న్యాయమూర్తి కృపాకరన్ ఆవేదన



గోపాలాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఆవేదనకు గురిచేస్తున్నాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి కృపాకరన్ తెలిపారు. వేలూరు సాంకేతిక విశ్వవిద్యాలయంలో దివంగత న్యాయవాది రాజగోపాలాచారి వర్ధంతి వేడుకలు జరిగాయి. వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులు రమణి, కాదంబరి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా అధిథులు, నిర్వాహకులు గోపాలాచారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు స్టేషన్లలో ఆగకుండా వెళ్లిన లోకల్ రైలు

● ప్రయాణికుల ఇబ్బందులు

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అరక్కోణం - చెన్నై సెంట్రల్ లోకల్ విద్యుత్ రైలు రెండు రైల్వేస్టేషన్లలో ఆగకుండా వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 6.40 గంటలకు అరక్కోణం నుంచి బయలుదేరిన ఆ రైలు పులియమంగళం, మోసూరు రైల్వే స్టేషన్లలో ఆగకుండా వెళ్లింది. తిరువలంగాడు రైల్వేస్టేషన్ వద్ద ఆ రైలు ఆగింది. దీంతో పులియమంగళం, మోసూరు స్టేషన్లలో దిగాల్సిన ప్రయాణికులు అక్కడ దిగి మరో రైలులో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇక ఈ రైలు ఆగకుండా వెళ్లడంతో ఆ రెండు రైల్వేస్టేషన్లలో చెన్నై వైపు వెళ్ళాల్సిన విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తిరువలంగాడు స్టేషన్‌లో ఆ రైలు ఆగగానే ప్రయాణికులు లోకోపైలట్‌తో గొడవపడ్డారు. తాను కొత్తగా ఆ మార్గంలో డ్యూటీలో చేరానని, పొరపాటున ఆ రెండు స్టేషన్‌లలో రైలు ఆపలేదని వివరించడతో ప్రయాణికులు శాంతించారు.

ఐఐటీ, ఐఐఎం పరిశోధనలకు రూ.3.50 కోట్లు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊటీ, కొడైకెనాల్‌లో ఎంతవరకు వాహనాలు, పర్యాటకులను అనుమతించవచ్చు, ఆ పర్యాటక ప్రాంతాలు ఎంతమేర వాహనాలను తట్టుకోగలవు తదితర అంశాలపై పరిశోధన జరపాలని మద్రాసు హైకోర్టు ఇటీవల ఆదేశించింది. హైకోర్టుల ఉత్తర్వుల మేరకు ఊటీలో పరిశోధనలు చేపట్టేందుకు చెన్నై ఐఐటీ, కొడైకెనాల్‌లో పరిశోధనలకు బెంగళూరు ఐఐఎం విద్యా సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పరిశోధనల కోసం చెన్నై ఐఐటీకి రూ.2.8 కోట్లు, బెంగళూరు ఐఐఎంకు రూ.1.50 కోట్లు మొత్తం రూ.3.50 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ కార్యదర్శి సెందిల్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ బృందాలు ఏడాదిలోగా పరిశోధనలు పూర్తిచేయాలని, అదే సమయంలో 2025 వేసవి సీజన్‌కు చేపట్టాల్సిన చర్యలపై సిఫారసులు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మా పాలనలో స్వతంత్రంగా పోలీసు వ్యవస్థ

● మాజీ మంత్రి డి.జయకుమార్

పెరంబూర్, నవంబరు 22: అన్నాడీఎంకే పాలనలో పోలీసు వ్యవస్థ స్వతంత్రంగా పనిచేసిందని మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. మధురవాయల్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. అన్నాడీఎంకే పాలనలో పోలీసులు స్వతంత్రంగా పనిచేసి, రౌడీలను ఉక్కుపాదంతో అణచివేసి, ప్రజలు భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా జీవించారని అన్నారు. రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికారం చేపట్టడం తథ్యమని, అనంతరం డీఎంకేకు శాశ్వత వనవాసం తప్పదని మంత్రి జోస్యం చెప్పారు.

గణిత ప్రతిభా పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్రం ఆధ్వర్యంలో 5 నుంచి 8వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష జనవరి 5వ తేది జరుగనుంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు డిసెంబరు 20 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. కోట్టూరుపురంలోని తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్రం ప్రాంగణంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు (90 నిముషాలు) పరీక్ష జరుగనుంది. మొదటి బహుమతిగా రూ.5,000లు, రెండో బహుమతిగా రూ.2,000, మూడో బహుమతిగా రూ.1,000, నాలుగో బహుమతిగా 20 మందికి తలా రూ.500 అందించనున్నారు. వివరాలకు 044-24410025 అనే నెంబరు సంప్రదించవచ్చని కేంద్రం డైరెక్టర్ లెనిన్ తమిళ్‌కోవన్ ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రాడ్‌వే-తాంబరం మధ్య అదనపు బస్సులు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం బ్రాడ్‌వే-తాంబరం, తాంబరం-చెంగల్పట్టు మధ్య అదనపు బస్సులు నడుపనున్నట్లు మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ప్రకటన విడుదల చేసింది. చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు, తిరుమాల్‌పూర్, కాంచీపురం, అరక్కోణం తదితర ప్రాంతాలకు వెళ్లే సబర్బన్ రైళ్ల టైం టేబుల్‌లో మార్పుల చేపట్టారని, ఈ కొత్త టైంటేబుల్ శుక్రవారం నుంచి అమలులోకి వచ్చింది. కొత్త టైం టేబుల్ ప్రకారం, శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేది వరకు 28 సబర్బన్ రైళ్ల రద్దయ్యాయి. ఈ క్రమంలో, ప్రయాణికుల సౌకర్యార్థం బ్రాడ్‌వే-తాంబరం మధ్య నడుపుతున్న ఎంటీసీ బస్సులతో పాటు అదనంగా 10 బస్సులు, తాంబరం-చెంగల్పట్టు మధ్య నడుపుతున్న బస్సులతో పాటు అదనంగా 10 బస్సులు నడుపుతున్నట్లు ఎంటీసీ తెలియజేసింది.



శిక్షణలో విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉద్యాన క్షేత్ర శిక్షణ

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఉత్తరమేరూర్ పంచాయతి కలియాంపూండి, కాంచీపురంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాల విద్యార్థులకు పది రోజుల ఉద్యాన క్షేత్ర శిక్షణ గురువారం ప్రారంభమైంది. కాంచీపురం-ఉత్తిరమేరూర్ రోడ్డు సమీపంలోని విచన్‌తంగాల్‌లోని ప్రభుత్వ ఉద్యానవనంలో జరుగుతున్న శిక్షణలో మొక్కలు నాటడం, ఎరువుల వినియోగం, మట్టి మిశ్రమం తయారీ, కలుపు తీయడం తదితరాలు, ఉద్యాన పంటల సాగులో ఆధునిక సాంకేతిక వినియోగం తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి ఎస్.సౌమ్య తెలిపారు. ఈ శిక్షణలో ఇతర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వ్యవసాయ వృత్తి విద్య విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

మాజీ మంత్రి వేలుమణి సమక్షంలో

అన్నాడీఎంకే నేతల బాహాబాహి



అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వేలుమణి సమక్షంలో అన్నాడీఎంకే నేతలు కొట్టుకున్నారు. తిరునెల్వేలి జిల్లాలో జరిగిన ఆ పార్టీ క్షేత్రస్థాయి సమీక్షా సమావేశంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇదేవిధంగా తంజావూరు జిల్లా కుంభకోణంలో కూడా ఆ పార్టీ నేతలు గొడవలు పెట్టుకున్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సమాయాత్తం చేసే చర్యల్లో భాగంగా అన్నాడీఎంకే నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా నెల్లై జిల్లాలోని వరగూరులో జరిగిన సమీక్షా సమావేశానికి మాజీ మంత్రి వేలుమణి హాజరయ్యారు. ఆ సమయంలో రెండు వర్గాలుగా విడిపోయిన పార్టీ నేతలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో సమావేశంలో పాల్గొన్న అనేక మంది క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను వివరించే ప్రయత్నం చేయగా, కొందరు నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో నేతల మధ్య వాగ్వివాదం జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పార్టీ నేతల తీరును మాజీ మంత్రి వేలుమణి చూస్తూ మిన్నకుండిపోయారు. అదేవిధంగా కుంభకోణంలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. మైకులో కేవలం నేతలు మాత్రమే ప్రసంగించకుండా, కార్యకర్తలకు కూడా ప్రసంగించే అవకాశం ఇవ్వాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగి నేతలు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది.

అదానీతో ఒప్పందాలు లేవని శ్వేతపత్రం

● ప్రేమలత డిమాండ్

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అదానీ సంస్థతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని శ్వేతపత్రం విడుదల చేయాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈమేరకు శుక్రవారం ఆమె విడుదలచేసినప్రకటనలో... అదానీ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని విద్యుత్ శాఖ మంత్రి సెందిల్ బాలాజీ చెబుతున్నారన్నారు. అయినా అవినీతి ఆరోపణలు దాచినా, వాటి వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. న్యాయస్థానం కూడా స్వయంగా ముందుకొచ్చి అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు. అమెరికాలో అదానీ సంస్థపై అభియోగాలు వచ్చాయని, నిప్పు లేనిదే పొగ రాదనే విధంగా, తాజాగా వస్తున్న అవినీతి ఆరోపణలపై ప్రజలకు వివరించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ప్రేమలత డిమాండ్ చేశారు.

పల్లిక్కరనై చిత్తడి నేలలో ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలు కూల్చివేస్తున్న అధికారులు

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ చెన్నై పరిధిలోని పల్లిక్కరనై చిత్తడి నేలను ఆక్రమించి నిర్మించిన 47 ఇళ్లను అధికారులు శుక్రవారం కూల్చివేశారు. పల్లిక్కరనై పరిధిలోని మేట్టుకుప్పం, వీటీపి అవెన్యూ, మహాలక్ష్మి నగర్ ప్రాంతాల్లోని అటవీ శాఖకు చెందిన చిత్తడి నేల ను కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. వీటిని కూల్చివేసే ప్రయత్నాలు చేపట్టిన అటవీ శాఖ అధికారులకు స్థానికంగా వ్యతిరేకత రావడంతో వారు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి, నీటివనరులను ఆక్రమించి నిర్మాణాలు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి కట్టడాలను కూల్చివేసి సంబంధితులపై చర్యలు చేపట్టవచ్చని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, పల్లికరనై చిత్తడి నేల ప్రాంతాల్లో ఉన్న 47 ఇళ్లను ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీసులకు ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో శుక్రవారం ఉదయం ఎక్సకవేటర్ వాహనాలతో వెళ్లిన రెవెన్యూ అధికారులతో పల్లికరనై ప్రాంతానికి చెందిన సుమారు 50కి పైగా కుటుంబీకులు వాగ్వివాదానికి దిగారు. దీంతో, పద్మ, పన్నీర్‌సెల్వం, రాజా సహా 8 మందిని అరెస్ట్ చేశారు. అనంతరం పోలీసుల భద్రత మధ్య ఆక్రమణ ఇళ్లు కూల్చివేసి, హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.

ఆటో డ్రైవర్‌ను బెదిరించి రూ.3 లక్షల దోపిడీ

● ముఠా కోసం గాలింపు

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరైలో ఆటో డ్రైవర్‌ను బెదిరించి రూ.3 లక్షలు దోచుకొని పరారైన ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈస్ట్ తాంబరంకు చెందిన సుఖిత (47) అనారోగ్యంతో గురువారం అమింజికరైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్యం కోసం బంధువైన లూర్ద్‌రాజ్ (58) అనే ఆటో డ్రైవర్ ఈస్ట్ తాంబరం నుంచి ఆటోలో రూ.3 లక్షలు తీసుకుని అమింజికరై బయల్దేరాడు. అమింజికరైలోని ఓ హోటల్‌లో భోజనం పార్శిల్ చేయించేందుకు ఆటో ఆపిన లూర్ద్‌రాజ్‌ను ద్విచక్రవాహనంలో వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో బెదిరించి రూ.3 లక్షల సంచితో పరారయ్యారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు, దోపిడీ జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించి పరారైన దోపిడి ముఠా కోసం గాలిస్తున్నారు.

పర్యావరణ పార్క్‌గా కడపాక్కం చెరువు



కడపాక్కం చెరువులో చేపట్టిన పనులు

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) స్థానిక మనలి ప్రాంతంలో 135 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువును రూ.58 కోట్ల వ్యయంతో పర్యావరణ పార్క్‌గా మార్చే పనులు ప్రారంభించింది. 2015వ సంవత్సరం సంభవించిన భారీ వరదల అనంతరం జీసీసీ పరిధిలో ఉన్న పలు స్థలాలు ఆక్రమణలకు గురికావడంతో పాటు చెరువులు, వాగులను పరామర్శించే వారు లేక చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సుమారు 100కు పైగా చెరువులు, వాగులను ఆక్రమణల నుంచి విడిపించిన జీసీసీ, వాటిని ప్రజలకు ఉపయోగకరంగా ఉంచేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం మనలి జోన్ 16వ వార్డులో ఉన్న కడపాక్కం చెరువులో పేరుకుపోయిన చెత్త, ముళ్ల చెట్లు తదితరాలను తొలగించే పనులు ప్రారంభించింది. ఈ పనులు పూర్తయితే ఈ చెరువు లోతు పెరిగి అధికస్థాయిలో నీటిని నిల్వ ఉంచొచ్చు. అంతేకాకుండా, ఈ పర్యావరణ పార్క్‌లో ప్రజలను ఆకట్టుకొనే విధంగా వాకింగ్ ట్రాక్, బటర్‌ఫ్లై పార్క్, రెండు పక్షుల దీవులు, వాటర్ ఫౌంటైన్, ప్రజలు విశ్రాంతి తీసుకొనేందుకు కుర్చీ వసతి తదితరాలు సమకూరుస్తున్నట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

నటి సీత ఇంట్లో చోరీ

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కం పుష్పాకాలనీలో నివసిస్తున్న ప్రముఖ సినీనటి సీత ఇంటిలో సుమారు ఐదు సవర్ల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. గురువారం రాత్రి నటి సీత తమ్ముడి భార్య నగలను భద్రపరిచి నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం లేచి చూడగా నగలు కనిపించలేదు. ఈ విషయమై సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. అనుమానంతో ఆ ఇంటి పని మనుషులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

సైబర్ నేరస్తుల ఆస్తులు స్తంభన

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్తులు ఆస్తులు స్తంభింపజేయాలని రాష్ట్ర సైబర్ క్రైం నిరోధక విభాగం ఏడీజేపీ సందీప్ మిట్టల్ ఆదేశించారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల గురించి అశోక్‌నగర్‌లోని రాష్ట్ర సైబర్ క్రైం నిరోధక విభాగం కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీజీపీ సందీప్‌మిట్టల్ మాట్లాడుతూ... ఆన్‌లైన్ ద్వారా నగదు మోసానికి పాల్పడే వారిని అరెస్ట్ చేయడంతో పాటు, సైబర్ నేరాల సూత్రధారులను కూడా అరెస్ట్ చేయాలన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వారి ఆస్తులు స్తంభింపజేయాలని, సైబర్ కేసుల విచారణ సత్వరం ముగించి బాధితుల కోల్పోయిన నగదు సకాలంలో స్వాధీనం చేసుకొని వారికి అప్పగించాలన్నారు. కోర్టుల విచారణలో ఉన్న సైబర్ కేసులకు సంబంధించి దాఖలుచేయాల్సిన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఏడీజీపీ ఆదేశించారు.

పొలంలో చొరబడిన మొసలి పట్టివేత



మొసలిని బంధించిన వండలూరు పార్క్ సిబ్బంది

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కార్నై సమీపం అరుంగాల్ గ్రామంలోని వ్యవసాయ భూమిలో ప్రవేశించిన మొసలిని వండలూరు పార్క్ సిబ్బంది బంధించారు. ఈ పొలం మీదుగా శుక్రవారం ఉదయం వెళ్తున్న రైతు ఆ ప్రాంతంలో పెద్ద మొసలి, రెండు చిన్న మొసళ్లు సంచరించడం గమనించాడు. ఈ విషయాన్ని వండలూరు పార్క్ సిబ్బందికి గ్రామస్తులు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని సుమారు గంట పాటు శ్రమించి మొసలిని బంధించి వండలూరు పార్క్‌కు తరలించారు. అదే సమయంలో పొలం నుంచి కాలువ ద్వారా వెళ్లిన రెండు చిన్న మొసళ్ల కోసం సిబ్బంది గాలిస్తున్నారు.

వెయ్యేళ్ల నాటి నంది విగ్రహం లభ్యం



లభ్యమైన నంది విగ్రహం

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం ఆదికుంబేశ్వర్ ఆలయంలో వర్షం నీరు నిలిచిపోకుండా కాలువ తవ్వకాలు గురువారం ప్రారంభమయ్యాయి. కాలువ మూడడుగల లోతున తవ్విన సమయంలో, రెండున్నర అడుగుల ఎత్తు, పొడవుతో అద్భుత శిల్పకళ నైపుణ్యంతో కూడిన నంది విగ్రహం బయల్పడింది. ఈ విషయమై ఆలయ నిర్వహణాధికారి కృష్ణన్‌కుమార్ మాట్లాడుతూ... చోళుల కాలం నాటి శిల్పాలతో ముదురు రంగు నల్లరాతితో నంది విగ్రహం ఉందన్నారు. ఈ విగ్రహం సుమారు వెయ్యేళ్ల ప్రాచీనమైనది కావచ్చని, ఈ విషయమై రెవెన్యూ, పురావస్తు శాఖ అధికారులు పరిశీలిస్తున్నారని, ఆ తర్వాత పూర్తి సమాచారం అందుతుందని ఆయన తెలిపారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పేరావూరణి సమీపంలో లారీలో తరలించిన 300 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. పేరావూరణి మార్గంలో వాహనాల ద్వారా మాదకద్రవ్యాలు తరలిస్తున్నట్లు తంజావూరు ప్రత్యేక పోలీసు విభాగానికి అందిన సమాచారంతో శుక్రవారం తెల్లవారుజామున కలైంజర్ నగర్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేరావూరణి-ఉమ్మత్తనాడు రోడ్డులో వచ్చిన లారీ ఆపి తనిఖీ చేశారు. అందులో సరుకుల కింద దాచిన గంజాయి పొట్లాలను గుర్తించారు. సుమారు 300 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో తెన్‌కాశి జిల్లా ఆలంగుళం ప్రాంతానికి చెందిన అన్నాదురై, ధర్మరాజ్, ముత్తయ్యలను అరెస్ట్ చేసి విచారణ అనంతరం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

శ్రీలంక చెర నుంచి విడుదలైన జాలర్లు



నగరానికి తిరిగొచ్చిన జాలర్లు

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలు నుండి విడుదలైన ఐదుగురు తమిళ జాలర్లు గురువారం రాత్రి విమానంలో నగరానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం వీరిని ప్రభుత్వ అధికారులు వేర్వేరు వాహనాలలో రామేశ్వరం, పుదుకోట ప్రాంతాలకు పంపారు. గత మార్చిలో శ్రీలంక నావికాదళం అరెస్టు చేసి, అక్కడి న్యాయస్థానం విధించిన ఆరు నెలల జైలు శిక్ష అనుభవించిన ఆంటోని(50) అనే రామేశ్వరం జాలరి, మరో సంఘటనలో శ్రీలంకనావికాదళం నిర్బంధించిన నలుగురు జాలర్లు విడుదలై విమానంలో గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు.

అడవిలో చిక్కుకున్న అయ్యప్ప భక్తులు

● రక్షించిన కేరళ పోలీసులు

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని ఉడిపి జిల్లా పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు అయ్యప్ప భక్తులు చిక్కుకుపోయారు. వీరిని కేరళ పోలీసులు, ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందం రక్షించింది. నగరానికి చెందిన 20 మంది అయ్యప్ప భక్తుల బృందం శబరిమలకు ఇటీవల బయలుదేరింది. వీరిలో లక్ష్మణన్ (40), వరుణ్ (20), కోటీశ్వరన్ (40) కూడా ఉన్నారు. వీరంతా కేరళ రాష్ట్రంలోని పులమేడు ప్రాంతం మీదుగా శబరిమల ఆలయానికి బయలుదేరారు. ఇడుక్కి జిల్లా వండిపెరియార్ నుంచి దాదాపు 10 కిలోమీటర్ల మేరకు దట్టమైన అటవీ ప్రాంతంలో నడిచి వెళ్ళి శబరిమలె చేరుకోవాల్సి ఉంది. వీరంతా కలిసి వెళ్తుండగా, మార్గ మధ్యంలో అస్వస్థతకు గురికావడంతో లక్ష్మణన్, వరుణ్, కోటీశ్వరన్ ఆగిపోగా, మిగిలిన భక్తులు ముందుకు వెళ్లారు. అయితే, ఈ ముగ్గురు కొంతదూరం వెళ్ళిన తర్వాత అడవిలో దారితప్పారు. ముందు వెళ్ళిన భక్తులు తమ గమ్యస్థానానికి చేరుకున్నప్పటికీ ఈ ముగ్గురు మాత్రం రాలేదు. దీంతో ఆందోళన చెంది కేరళ పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే అటవీ ప్రాంతంలో భక్తులకు భద్రత కోసం ఏర్పాటు చేసిన పోలీస్ పోస్టులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు, అటవీ సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందం ముమ్మర గాలించారు. కొన్ని గంటల పాటు గాలించి, ఈ ముగ్గురి ఆచూకీ కనిపెట్టి, సురక్షితంగా శబరిమల చేర్చారు. ఆ తర్వాత ఈ భక్తులను ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించగా, వారంతా కోలుకుని శుక్రవారం ఉదయం చెన్నై చేరుకున్నారు.

విఘ్నేష్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని డాక్టర్ కలైంజర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ బాలాజీపై దాడికి పాల్పడిన నిందితుడు విఘ్నేష్ బెయిల్ పిటిషన్‌ను చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి కార్తికేయన్ విచారణ రాగా, నిందితుడు, పోలీసుల తరపున హాజరైన న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. డాక్టర్ బాలాజీకి అనేక చోట్ల గాయాలయ్యాయని, నిందితుడిని విచారిస్తున్నామని, అందువల్ల బెయిల్ ఇవ్వొద్దని పోలీసుల తరపు న్యాయవాది కోరారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి బెయిల్ పిటిషన్ కొట్టివేశారు.

ఈ-సేవా కేంద్రాల్లో వసతులు కల్పించాలి

తిరుత్తణి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ-సేవా కేంద్రంలో వసతులు కల్పించాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్కేపేట మండల కార్యాలయంలో ఉన్న ఈ-సేవా కేంద్రానికి సుమారు 200 మందికి పైగా వస్తుంటారు. ఈ కేంద్రంలో కూర్చొనేందుకు సీట్లు కూడా లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఏడేళ్ళ తర్వాత శ్రియా రీఎంట్రీ

సీనియర్ నటి శ్రియ ఏడేళ్ళ తర్వాత తమిళ చిత్రపరిశ్రమలో రీఎంట్రీ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. తమిళ ఇండస్ట్రీలో 'ఎనక్కు 20 ఉనక్కు 18', 'మళై', 'తిరువిళైయాడల్ ఆరంభం', 'శివాజీ', 'అళగియ తమిళన్ మగన్' వంటి అనేక చిత్రాల్లో నటించారు. ఆమె చివరిసారిగా గత 2017లో ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో శింబు నటించిన 'అన్బానవన్ అసరాదవన్ అడంగాదవన్' చిత్రంలో నటించారు. ఆ తరువాత వివాహం చేసుకుని తమిళ పరిశ్రమకు దూరమయ్యారు. ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య నటించే 'సూర్య-44'లో రీఎంట్రీ ఇస్తున్నారు. దీనిపై శ్రియ మాట్లాడుతూ, కోలీవుడ్‌లో ఏడేళ్ళ తర్వాత రీఎంట్రీ ఇవ్వడంతో పాటు హీరో సూర్యతో కలిసి తొలిసారి నటిస్తున్నాను. ఒక పాటలో ఆయనతో కలిసి నృత్యం కూడా చేశాను' అని పేర్కొన్నారు.



రజనీకాంత్ - సత్యరాజ్

రజనీతో నటించడం సంతోషం

● సత్యరాజ్

'కూలీ' చిత్రం కోసం సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందని సీనియర్ నటుడు సత్యరాజ్ వెల్లడించారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో చాలాకాలం తర్వాత రజనీ - సత్యరాజ్ కలిసి నటిస్తున్నారు. దీనిపై సత్యరాజ్ మాట్లాడుతూ, 'రజనీతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. పాత విషయాల గురించి మాట్లాడుకున్నాం. ఆరోగ్యం, ఫిట్నెస్ వంటి విషయాలతో పాటు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నాం. అపుడే 70 యేళ్ళు వచ్చాయా అని రజనీ ఆశ్చర్యంగా అడిగారు. నేను 45 యేళ్ళుగా నటిస్తూనే ఉన్నాను. మేమిద్దరం కలిసి నటించిన తొలి చిత్రం 'మూంద్రు ముగం'. ఆ తర్వాత ఏడెనిమిది చిత్రాల్లో నటించాం. ఇక 'కూలీ' సినిమా విశేషాలను వెల్లడించలేను' అని పేర్కొన్నారు. కాగా, 'కూలీ' మూవీలో రజనీ, సత్యరాజ్, ఉపేంద్ర, నాగార్జున, శృతిహాసన్ తదితరులు నటిస్తుండగా, వచ్చే యేడాది వేసవి సెలవుల్లో విడుదల చేయనున్నారు.

చిత్రజ్యోతి

110 నిమిషాలపాటు శవంగా ప్రభుదేవా!

ప్రభుదేవా హీరోగా నటించిన తాజా చిత్రం 'జాలియో జింఖానా'. శక్తి చిదంబరం దర్శకుడు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రంలో మడోన్నా సెబాస్టియన్, అభిరామి, యోగిబాబు, రోబో శంకర్ తదితరులు నటించారు. రాజన్, నీలా నిర్మాతలు. ఈ సినిమా గురించి దర్శకుడు శక్తి చిదంబరం మాట్లాడుతూ, 'గత రెండుమూడేళ్ళుగా విడుదలైన చిత్రాల్లో హింస, కులమత ద్వేషాలు, పగలు ప్రతీకారాలు అధికంగా ఉన్నాయి. కానీ, ఈ సినిమా ఇప్పటివరకు వచ్చిన చిత్రాలకు పూర్తిభిన్నం. ఒక మృతదేహం, దాన్ని మోసుకెళ్ళే ఒక హీరో కథ. స్టోరీ వినగానే డెడ్‌బాడీగా నటిస్తానని హీరో అంగీకరించడం నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ తర్వాత నలుగురు హీరోయిన్లను తీసుకున్నాను. ఒకటిన్నర రోజులో జరిగే కథలో 110 నిమిషాల పాటు ప్రభుదేవా డెడ్‌బాడీగా నటించారు. ఆయన అలా నటించే సమయంలో ఆయన వెనుక పలువురు నటీనటులు కామెడీ చేస్తున్నప్పటికీ ఆయన మాత్రం అన్నింటినీ నియంత్రించుకుంటూనే డెడ్‌బాడీగా నటించారు. నిజంగా ఇది ఒక రికార్డే. గతంలో 'మగళిర్ మట్టుం' సినిమాలో గొప్ప నటుడు దివంగత నాగేశ్ డెడ్‌బాడీగా కొంతభాగంలో నటించారు. ఇపుడు ప్రభుదేవా మాత్రం సినిమా మొత్తం శవంగా నటించారు' అని పేర్కొన్నారు. ప్రభుదేవా మాట్లాడుతూ, 'ఇలాంటి కథను అంగీకరించి తెరకెక్కించాలంటే ఎంతో ధైర్యం కావాలి. ఇలాంటి పాత్రను నాకు ఇచ్చినందుకు దర్శకుడు శక్తి చిదంబరంకు ధన్యవాదాలు' అన్నారు



'జాలియో జింఖానా' చిత్ర బృందం

కామెంట్స్‌పై న్యాయపరంగా చర్యలు

● తిరుపూర్ సుబ్రమణియం



ఒక సినిమా చూసిన తర్వాత థియేటర్ బయట యూట్యూబర్లు సేకరించే ప్రేక్షకుల కామెంట్స్ పాజిటివ్‌గా ఉంటే ఎలాంటి సమస్యా లేదని, ఒకవేళ నెగెటివ్‌గా, దురుద్దేశపూరితంగా కామెంట్స్ చేసే వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని తమిళనాడు థియేటర్స్ అండ్ మల్టీప్లెక్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు తిరుపూరు సుబ్రమణియం హెచ్చరించారు. సూర్య నటించిన 'కంగువా' చిత్రంపై తొలి ఆట నుంచే నెగెటివ్ రివ్యూలు చేశారు. ఫలితంగా సినిమా కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా మీడియాతో మాట్లాడుతూ, రివ్యూలపై నిషేధం విధిస్తే యూట్యూబర్స్ జీవనోపాధిని కోల్పోతారనే విమర్శలు వస్తున్నాయని, నిజం చెప్పాలంటే కొన్ని యూట్యూబర్స్ వల్ల యావత్ చిత్రపరిశ్రమ తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునే హక్కు నిర్మాతలకు ఉందన్నారు. కొన్ని సినిమాలు రివ్యూల కారణంగానే విజయం సాధించాయన్నారు. సరైన విధానంలో రివ్యూ చేయడంలో ఎలాంటి తప్పులేదన్నారు. ఇకపై థియేటర్ ప్రాంగణంలో ట్యూబర్స్‌ను అనుమతించవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి, చెన్నై

ఫాతిమా బాబు...! తమిళ న్యూస్ రీడర్‌గా ప్రత్యేక గుర్తింపు. స్పష్టమైన తమిళ ఉచ్చారణ, అందమైన తమిళ వార్తల పఠనా లోకంలో మూడుదశాబ్దాలకు పైగా తమిళ టీవీ ప్రేక్షకులు, అభిమానులను తన స్వచ్ఛమైన కంఠస్వరంతో కట్టిపడేసిన ఓ విశిష్టమహిళ. మద్రాసు దూరదర్శన్ కేంద్రం, విజయ్ టీవీ, రాజ్‌టీవీ, జయా టీవీ వంటి ఛానళ్లలో ఆమె న్యూస్ రీడర్‌గా పనిచేశారు.. మద్రాసు రేడియో కేంద్రం 'ఎ' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా, నాటకాలు, సీరియల్స్, తమిళ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటిగా రాణించిన ఫాతిమా దాదాపు 44 ఏళ్లుగా కళామతల్లి సేవ చేస్తున్నారు.. ఈ సందర్భంగా తమిళ ప్రేక్షకులు, భాష, రంగస్థలం, సినీ రంగం, తమిళ సాహిత్యంతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని, విస్తారమైన అనుభవాలను ఇలా పంచుకున్నారు..



సింగపూర్ విమానం.. 11 గంటలు ఆలస్యం

● ప్రయాణికుల తీవ్ర అసౌకర్యం

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్ వెళ్ళాల్సిన విమానం 11 గంటల పాటు ఆలస్యంగా బయలుదేరింది. ఈ విమానం శుక్రవారం వేకువజామున 2.50 గంటలకు సింగపూర్‌కు 152 మంది ప్రయాణికులు క్రూ సిబ్బందితో బయలుదేరి వెళ్ళాల్సివుండగా, అనివార్య కారణాలతో 11 గంటల ఆలస్యంగా శుక్రవారం మధ్యాహ్నం 1.55 గంటలకు బయలుదేరి వెళ్ళింది. అయితే, ఈ విమానం ఆలస్యంగా బయలుదేరుతుందని ముందుగా సమాచారం ఇవ్వడంతో అనేక మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు రాలేదు. కొందరు మాత్రం సమాచార లోపం కారణంగా విమానాశ్రయానికి వచ్చి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.



మోదీ, అమిత్‌షా వ్యూహరచనతో ఈసారి రాష్ట్రంలో పాలన మాదే

● బీజేపీ మహిళా నేత ఖుష్బూ

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా రూపొందించబోయే కొత్త వ్యూహరచనతో పాలనలో మార్పు తథ్యమని, బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని బీజేపీ జాతీయ కార్యాచరణ కమిటీ సభ్యురాలు, నటి ఖుష్బూ పేర్కొన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఏ పార్టీ పరిపాలిస్తే మంచి జరుగుతుందో ప్రజలు బాగా అర్థం చేసుకుంటున్నారని, దేశమంతటా ప్రధాని మోదీపై ప్రజాదరణ విపరీతంగా పెరుగుతోందని అన్నారు. మణిపూర్ ఘటనలపై ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేతలంతా దుమ్మెత్తి పోశారని, చివరకు ఆ రాష్ట్రం కాంగ్రెస్ చిత్తుగా ఓడిందన్నారు.



తిరుముడివాక్కంలో నిర్దిష్ట ఇంజనీరింగ్, సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్టాలిన్

అన్నా వర్సిటీ ఇంటర్ జోన్ కబడ్డీ పోటీలు

● విజేతగా సెయింట్ జోసెఫ్ కాలేజి

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం పరిధిలో ఇంటర్ జోన్ కబడ్డీ మహిళ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో తంజావూరులోని ప్రభుత్వ సీతఈ కాలేజీని ఓడించగా క్వార్టర్ ఫైనల్స్‌లో తిరుచ్చిలోని యూసీఈ బిట్ క్యాంపస్ జట్టును. సెమీ ఫెనల్‌లో లయోలా కాలేజీని, ఫైనల్‌లో తొట్టియంలోని కొంగునాడు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ జట్లను ఓడించి టైటిల్ విజేతగా నిలిచిందని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్వో డాక్టర్ టి.గవాస్కర్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ట్రోఫీతో సెయింట్ జోసెఫ్ కాలేజీ జట్టు, నిర్వాహకులు

తరుణి

ఆరు పదుల వయసులోనూ అలుపెరుగని జీవనయానం

● కళామతల్లికి ఫాతిమా స్వర నీరాజనం



రజనీకాంత్‌తో..

బాల్యం.. విద్యాభ్యాసం...

1963 డిసెంబరు 26న పుదుచ్చేరిలో జన్మించాను. నా బాల్యమంతా అక్కడే గడిచింది. మా మాతృభాష మలయాళం. చదివింది ఇంగ్లీష్ మీడియం. అయితే పదో తరగతి వరకూ సెకెండ్ లాంగ్వేజీ తమిళం. నా తమిళ టీచర్ల బోధనలతోనే ఆ భాషపై చిన్న వయస్సులోనే ఆసక్తి పెరిగింది. అందువలనే తమిళభాష నాలో శాశ్వతంగా తిష్ట వేసుకుంది. 'వీరపాండ్య కట్టబొమ్మన్', 'మనోహరా' వంటి చారిత్రక తమిళ చలన చిత్రాల్లోని వీరోచితమైన సంభాషణలను కంఠస్థం చేసి ఇంటా బయటా ఏకపాత్రాభినయం చేసేదాన్ని. మా నాన్న తమిళ వీరాభిమాని, తల్లి రాష్ట్ర ఆరోగ్యశాఖ ఉద్యోగి. వారిద్దరూ నాలో దాగిన నటిని కూడా వెలికితీశారు. తరచూ చిన్న చిన్న నాటకాలు వేయించేవారు. స్కూలు డ్రామా పోటీల్లో వేసిన కన్నగి వేషం నా రంగస్థల ప్రవేశానికి తొలి బీజంగా మారింది.

రేడియో కళాకారిణిగా ..

పదహారేళ్ల వయస్సులో పుదుచ్చేరి ఆలిండియా రేడియో ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రామా ఆడిషన్‌లో ఎంపికై రంగస్థల స్వరకర్త కళాకారిణి అయ్యాను. బీకామ్ చదివి, పుదుచ్చేరి రేడియో స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో ఓ రోజు రెగ్యులర్ న్యూస్ రీడర్ సెలవుపై వెళ్లటంతో తొలిసారి లైవ్‌లో వార్తలు చదివే అవకాశం కలిగింది. ఆ సమయంలో అక్కడే పనిచేస్తున్న అసిస్టెంట్ న్యూస్ ఎడిటర్ ఉదయశంకర్ 'మీరు దూరదర్శన్‌లో న్యూస్ రీడర్‌గా చేరొచ్చు కదా' అని సూచించారు. ఆ క్షణం నుండి నాలో దూరదర్శన్ న్యూస్ రీడర్ కావాలనే కోరిక పుట్టింది. అది నెరవేరాలంటే దూరదర్శన్ కేంద్రం ఉన్న చెన్నై వెళ్ళాలి. అందుకే స్టెల్లా మేరీస్ కాలేజీలో 'మాస్టర్ ఆఫ్ సోషియల్ వర్క్' కోర్సులో చేరాను. ఇక్కడ చదువుతున్నప్పుడే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఉద్యోగావకాశం లభించింది. ప్రభుత్వ ఉద్యోగం కావడంతో పీజీ కోర్సు అర్ధాంతరంగా వదలి ఆ ఉద్యోగంలో చేరాను. నా అదృష్టం.. ఆ ఉద్యోగంలో చేరిన మూడు నెలల్లోనే మద్రాసు దూరదర్శన్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది.

తొలిసారి దూరదర్శన్ న్యూస్‌రీడర్‌గా..

1987 జూలై 1న తొలిసారిగా మద్రాసు దూరదర్శన్‌లో వార్తలు చదివాను. ఆ సమయంలో తీసిన నా ఫోటోను ప్రముఖ తమిళ దినపత్రికలో ప్రచురితమైంది. 'మద్రాసు దూరదర్శన్ వార్తాలోకంలో కొత్త ముఖం' అనే శీర్షికతో వార్త కూడా వచ్చింది. ఆ పేపర్ కటింగ్‌ని ఫ్రేమ్‌వేసి మరీ పదిలపరచుకున్నాను. తిరుప్పూరుకు చెందిన ఓ ఫొటో గ్రాఫర్ న్యూస్ చదువుతున్న నా ఫొటో తన స్టూడియోలో పెట్టుకున్నాడు. నా వీరాభిమాని అయిన ఆ యువకుడు నన్ను వివిధ భంగిమల్లో తీసిన ఫోటోలు కూడా దాచుకున్నాను. అంతేకాదు, నా వివాహానికి కూడా ఆ యువకుడే ఫొటోగ్రాఫర్‌గా పనిచేశాడు. న్యూస్‌రీడర్‌గా నా తమిళ పదాల ఉచ్చారణను చూసి విదేశీ తమిళులు కూడా నన్ను మెచ్చుకునేవారు. నా అభిమాని ఒకరు దుబాయ్ నుంచి కుటుంబంతో వచ్చి నా ఆతిథ్యం తీసుకున్న పాత జ్ఞాపకాలు నన్నెంతగానో ఆనందింపజేస్తాయి.



రంగస్థలం, సినిమా...

కృష్ణసామి అసోసియేట్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా రంగస్థల నటిగా ప్రవేశం చేశాను. ఆ తర్వాత దూరదర్శన్‌లో 'చిత్తిరపావై' అనే తమిళ సీరియల్‌లో నటించాను. ఇక సినీ దర్శకదిగ్గజం కె.బాలచందర్ ద్వారా 'కల్కి' అనే సినిమా ద్వారా నటిగా అడుగుపెట్టాను. అప్పటికే బాలచందర్ దర్శకత్వం వహించిన పలు నాటకాలలోను నటించాను. ఫేబ్స్ థియేటర్ పేరుతో నటనపై ఆసక్తి కలిగిన యువతీయువకులకు నటనపై శిక్షణ కూడా ఇచ్చాను. ప్రముఖ రచయిత జ్ఞాని నాటకాలు, టీవీ రాధాకృష్ణన్ సౌమ్యా ట్రూప్ కోసం వేదికలెక్కి ఆకట్టుకున్నాను. మైలాపూరు అకాడమీ, కార్తీక్ ఫైన్ ఆర్ట్స్ వంటి సంస్థల నుండి ఉత్తమనటిగా ఎన్నో అవార్డులు కూడా అందుకున్నాను దూరదర్శన్‌లో న్యూస్‌రీడర్‌గా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఉద్యోగిగా, డ్రామాలు, సినిమాలు, సీరియళ్లలో నటిగా అందరి మన్ననలు పొందటానికి నా భర్త బాబు సహాయసహకారాలు మరువలేనివి.



ఫాతిమాబాబు కుటుంబం

క్లబ్ హౌస్ ద్వారా తమిళం...

తమిళ సాహిత్యంలోని అద్భుతమైన కథానికలను నేటి యువతరానికి అందించాలనే సత్సంకల్పంతో 380కి పైగా తమిళ కథానికలను 'క్లబ్ హౌస్' అనే ఆడియో యాప్ ద్వారా ప్రతిరోజూ రాత్రి తమిళంలో చదివి వినిపించేదాన్ని. కథానికలు రాసిన రచయితలను కూడా లైవ్‌లో శ్రోతలకు పరిచయం చేసేదాన్ని. మేటి రచయితలు లా.సా. రామమృతం, శివశంకరి, సుజాత, జయకాంతన్, అశోక్ మిత్రన్, సుందర రామసామి, వణ్ణదాసన్, పూమణి, మౌళి, పట్టుకోట్టై ప్రభాకర్, చారునివేదిత కథానికలను లైవ్‌లో నా స్వరంతో శ్రోతలకు అందించడం మరువలేని అనుభవంగా మారింది.



మాజీ ముఖ్యమంత్రి జయలలితతో ఫాతిమా

ఆడియో బుక్స్‌లోనూ నా స్వరమే..

ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరి ఆత్మకథ 'సూర్యవంశం' అనే ఆడియో బుక్ రిలీజ్ చేసినపుడు ఆమె మాటలను నా స్వరంతో సభికులకు వినిపించడం కూడా మధురానుభూతిని కలిగించింది. 'పొన్నియిన్ సెల్వన్' ఆడియో బుక్‌లో 'నందిని' పాత్రకు నా స్వరం అందించాను. ఇలా దేవుడిచ్చిన నా మధురమైన కంఠస్వరం అన్ని సాంకేతికపరమైన అన్ని రూపాలలోనూ వినిపిస్తూనే ఉంటుంది.

ఇంటిలో ప్రతినెలా గెట్ టు గెదర్..

నా ఇద్దరు కుమారులు జీవితాల్లో స్థిరపడటంతో ఇంటిలో ఏర్పడిన వెలితిని పోగొట్టేందుకు ప్రతినెలా 'కూడుగై' పేరుతో తమిళ సాహితీపరమైన గెట్ టు గెదర్ కార్యక్రమాలను గడిచిన ఎనిమిది నెలలుగా నిర్వహిస్తున్నాను. నా కుటుంబ సభ్యులే కాదు సాహిత్యాభిమానులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నాను. చిత్తిరై కూడల్, ఆడి తిరన్, పురటాసి పూంగా, ఐప్పసి వైభవం వంటి తమిళ నెలల పేరుతో ఈ కార్యక్రమాలను జరుపుతున్నాను. తమిళ ప్రజలు, భాష, తమిళ సంస్కృతి సంప్రదాయాలు నాలో పెనవేసుకుపోయాయి. ఆరు పదుల వయస్సు దాటినా తమిళంతోనే నా శేషజీవితమూ కొనసాగుతుంది.

పిల్లలకు జీవిత విలువలు నేర్పించండి

● తెలుగు తరుణి అధ్యక్షురాలు రమణి ● శ్రీ వెంకటేశ్వర తెలుగు పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం


ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య దశలోనే పిల్లలకు జీవిత విలువలు నేర్పిస్తే పెద్దవారయ్యాక సమాజానికి శ్రేయస్కరంగా ఉంటారని తెలుగు తరుణి అధ్యక్షురాలు కె.రమణి పేర్కొన్నారు. స్థానిక నుంగంబాక్కం కుమరప్ప వీధిలో వెంకటేశ్వర తెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వహణలోని తెలుగు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణి మాట్లాడుతూ... మాతృభాష తెలుగులో చదువుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. భావితరాలకు మాతృభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని తెలుగు విద్యాసంస్థలు, సంఘాలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సీవీ సుబ్బారావు, ఆంధ్ర కళా స్రవంతి అధ్యక్షులు జేఎం నాయుడు, డా.పావని పాల్గొన్నారు. తెలుగు తరుణి తరఫున విద్యార్థులకు బహుమతులు, మధ్యాహ్న భోజనం అందజేశారు. అలాగే, ఆంధ్ర కళా స్రవంతి తరఫున 25 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. సంస్థ అధ్యక్షులు జేఎం నాయుడు విద్యార్థులను ప్రోత్సహిస్తూ తలా రూ.100 ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వీఎన్ హరినాథ్, పాఠశాల ట్రస్ట్ కోశాధికారి జీవీ రమణ, తెలుగు తరుణి తరఫున దేవసేన, మాజేటి అపర్ణ, కర్లపాటి శైలజ, విశాలాక్షి, నందిని, మాలతి, వసంతరాణి, చుక్కల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డెంటిస్ట్ డా.పావని విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు.



విద్యార్థులతో కె.రమణి, జేఎం నాయుడు తదితరులు

పాత కార్లలో విదేశీయుల విహారయాత్ర

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐరోపా దేశాల నుంచి పాత కార్లతో వచ్చిన విదేశీ పర్యాటకులు దేశంలోని వివిధ నగరాల్లో 'కార్ల ర్యాలీ' నిర్వహిస్తున్నారు. 45 మంది విదేశీ పర్యాటకులు 22 పాత కార్లతో ఈ నెల 14న గోవాలో ప్రారంభించిన ర్యాలీ హుబ్లీ, హంపీ, చిక్‌మంగళూరు, కూర్గ్, మైసూరు మీదుగా గురువారం నీలగిరి జిల్లా కున్నూరు చేరుకుంది. ఈ విషయమై విదేశీ పర్యాటకుడు హెల్కా ఫ్రెడిక్స్ మాట్లాడుతూ... 1932 నుంచి 1970 వరకు వినియోగించిన జాగ్వార్, మెర్సిడెస్-బెంజ్, పోర్షే, బెన్‌ట్లీ ఎంజీ, ఆల్విస్, వోల్వో తదితర కార్లలో వచ్చామన్నారు. జాతీయ రహదారులపై వెళ్లకుండా గ్రామీణ రహదారుల్లో వెళ్తున్నామని, శుక్రవారం పొల్లాచ్చి ఆనమలైకి వెళ్లనున్నామని, అక్కడి నుంచి కొచ్చిన్, తేక్కడి, మదురై, తంజావూరు, పుదుచ్చేరి మీదుగా వచ్చే నెల 1వ తేది చెన్నై చేరుకోనున్నామని తెలిపారు. 1932లో తయారుచేసిన ఆల్విస్ కారును 30 ఏళ్లుగా వినియోగిస్తున్నానని తెలిపారు. ఈ మోడల్ కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాలో విక్రయించారన్నారు. ఈ కారుకు కొన్ని మార్పులు చేసి ప్రపంచవ్యాప్తంగా 12 సార్లు ప్రయాణించినట్లు ఆయన తెలిపారు.



పాత కార్లతో వచ్చిన విదేశీ పర్యాటకులు



ఆయన లోకమే వేరు

పీ కల దాకా తాగాడు. మత్తు తలకెక్కింది. నడిరోడ్డులో పడకేశాడు. రద్దీగా ఉండే ఆ మార్గంలో వాహనాలు వచ్చి తొక్కేస్తాయన్న భయం లేదు. ఎందుకంటే ఆయన ఈ లోకంలో లేడు. గురకపెడుతూ నిద్రపోతున్నాడు. ఈ దృశ్యం పుత్తూరు పట్టణం నడిబొడ్డున హెడ్‌మాస్టర్ బావి వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌కు కనిపించింది. వాహనాలు అదుపు తప్పితే చనిపోతాడని భావించిన ఓ మానవతావాది అతన్ని రోడ్డు పక్కకు లాగి పడేశాడు.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

సంకల్ప 'బలం'

కష్టపడి బతకాలన్న సంకల్పం ముందు ఆయన వయస్సు చిన్నబోయింది. చిన్న వయస్సులో ఆసక్తితో రిక్షా డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఊహ తెలిశాక దాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాడు. 40ఏళ్లుగా రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు తిరుపతికి చెందిన 60 ఏళ్ల రామదాసు. ఈ వయస్సులోనూ రైల్వేస్టేషన్ నుంచి యాత్రికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాడు. రిక్షా తొక్కడం వల్ల వచ్చిన దాంతో ముగ్గురు కుమార్తెలను చదివించడమేగాక పెళ్లిళ్లు చేసి పంపించాడు. కుమార్తెలు తమవద్దకు రమ్మని చెబుతున్నా ఇన్నాళ్లు దారి చూపిన మార్గాన్ని వదులుకోలేక ఇప్పటికీ రిక్షా తొక్కుతున్నట్లు సంతోషంగా చెబుతున్నాడు.

- తిరుపతి, అర్బన్, ఆంధ్రజ్యోతి





భావరాగయుక్తంగా ఆయన గళం విప్పితే ప్రేక్షకులు తన్మయత్వం చెందుతారు. భక్తితత్వంలో లీనమవుతారు. దివ్యవేదాంతం మొదలు చక్కటి చిక్కటి హాస్యం పండించే తీరుకు పండితులే కాదు పామరులూ మంత్రముగ్ధులవుతారు. ఆయనే హరికథకుడు ఒంటి రవి. నారాయణవనం మండలం తిరువట్యానికి చెందిన ఈయన తండ్రి ఆనందరెడ్డి రంగస్థల కళాకారుడు. తాత మునిసుబ్బారెడ్డి తుంబుర గాయకుడు. కళను వారసత్వంగా పునికిపుచ్చుకున్న రవి తెలుగుమీద మమకారంతో తిరుపతి ప్రాచ్యకళాశాలలో చదివారు. తనకు ఇష్టమైన హరికథలో విశారద పట్టా పొందారు. ఎస్వీయూ నుంచి తెలుగులో పీహెచ్‌డీ చేశారు. - పుత్తూరు (ఆంధ్రజ్యోతి)

భళా..భాగవతార్

● రచయితగా..హరి కథకుడిగా రాణిస్తున్న తెలుగు అధ్యాపకుడు రవి

ఆధునిక కాలగమనంలో ఉనికి ప్రశ్నార్థకమవుతున్న ప్రాచీన కళారూపాల్లో ఒకటైన హరికథకు ఊపిరిలూదుతున్న వారిలో రవి ఒకరు. తన కుమారుడు హరికథ నేర్చుకోవాలనేది రవి తండ్రి ఆకాంక్ష. ఈదిశగానే చిన్నప్పటి నుంచి ఆయన హరికథ వైపు మొగ్గు చూపారు. కుప్పంలో హైస్కూలులో తెలుగు పండిట్‌గ కెరీర్ ప్రారంభించారు. 59ఏళ్ల రవి ప్రస్తుతం కార్వేటినగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఉద్యోగాన్ని అంకితభావంతో నిర్వర్తిస్తూ మరోపక్క తాను అమితంగా ఇష్టపడే హరికథనూ ఏనాడూ విస్మరించలేదు. వచనాపాటవం, తెలుగు భాషాభిమానం,సందర్భోచిత హాస్య కుశలత మెండుగా ఉన్న రవి 1986లో నారాణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో రంగస్థల అరంగేట్రం చేశారు. చదువుకునే రోజుల్లో రవీంద్ర భారతి(హైదరాబాద్)లో పార్వతీకల్యాణం హరికథను వినిపించారు. ఆ సందర్భంలో నటుడు అక్కినేని నాగేశ్వరరావు అభినందన ఆయనను ప్రోత్సహించింది. శ్రీకృష్ణ పాండవీయం ప్రదర్శన డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రశంసలందుకుంది. 1996లో అవధాని మేడసాని మోహన్ నిర్వహించిన అపూర్వ పంచ సహస్ర అవధానంలో ఆయనలోని భాషాపటిమను బయటపెట్టింది. ఉత్తమ పృచ్ఛకుడి అవార్డు సొంతం చేసుకోగలితారు. భారతం, భాగవతం, రామాయణం, శివపురాణాలను ఔపోసన పట్టిన ఆయన భాగవతార్‌గా నలభై ఏళ్లపాటు రాష్ట్రమంతా తిరిగారు. 2500 హరికథలను గానం చేసి ప్రేక్షకులను మెప్పించారు.

తెలుగుకు పట్టం

ఉద్యోగ విరమణ చేశాక తెలుగుబాషాభివృద్ధికి మరింత అంకితం కావాలని సంకల్పిస్తున్నాను. వ్యాకరణాంశాలు, పద్యాలు, లేఖారచనపుదు, ఛందస్సు, అలంకారాలపై పట్టు, గానం చేయడం లాంటి అంశాల్లో ఔత్సాహికులకు ఉచితంగా శిక్షణ ఇస్తాను. భారతం, భాగవతం, రామాయణం లాంటి ఇతి హాసాలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. ప్రాథమిక పాఠశాలలో తెలుగుకు పట్టం కట్టాలి.

- ఒంటి రవి

రచయిత కూడా.. : రవి హరికథకుడే కాదు మంచి రచయిత కూడా. 2023 శ్రీసిటీలో ఉత్తమ రచయిత పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీవెంకటేశ్వర శతకం, వేదనారాయణ శతకం, అక్షర తపస్మాన్ గీతాలు, భాషా కవితల రచనలు చేశారు. రెండు పెదవులు దగ్గరకు చేరుకుండా పలికే పద్య రచన చేయడం ఆయన విశిష్టత. హావ భావ నటన వైదుష్య, హరికథాసుధానిధి, పండిత కవి వంటి 15 పురస్కారాలను పొందారు. సంగీతసాహిత్యాలతోపాటు అభినయపూర్వకంగా భక్తిని, విజ్ఞానాన్నివినోదాన్ని ప్రదర్శించడంతో దిట్టగా పేరు సంపాదించారు.

కొండలా పేరుకున్న చెత్త



డంప్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

● ఐదేళ్లుగా వ్యర్థాల ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం

● సమస్యపై టీటీడీ చైర్మన్ ఫోకస్ ● మూడు నెలల్లో తొలగిస్తాం : ఈవో

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా తిరుమలలో మరో కొండను తలపించేలా చెత్త పేరుకుపోయింది. ఇక్కడి పర్యావరణానికి నష్టం కలిగేలా తయారైంది. పచ్చని చెట్ల మధ్య సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా రోజూ తడిచెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నులు సేకరిస్తున్నారు. దీనిని గోగర్భం డ్యాం సమీపంలోని డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రాసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి, మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్టులు ఉండే ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. పొడిచెత్తను కూడా వేరు చేసి పునర్వినియోగం చేయదగిన వాటిని తరలించాల్సి ఉంటుంది. గత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి తరలించడంలో కూడా విఫలమాయ్యారు. కంపోస్టు కేంద్రంలో సక్రమ నిర్వహణ జరగలేదు. వచ్చిన చెత్తంతా కుప్పగా పోస్తూ వచ్చారు. దీంతో కొండను తలపించేలా వ్యర్థాలు పోగుబడ్డాయి. ప్రాసెసింగ్ కాంట్రాక్ట్ ఎంపికలోనూ సిఫార్సులు, కమీషన్ల కక్కుర్తి కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని సమాచారం. సాధారణంగా 70 టన్నుల చెత్త వచ్చే ప్రాంతం కనీసం మూడెకరాలైనా ఉండాలి. కానీ తిరుమలలోని డంప్‌యార్డ్ ప్రదేశం ఒకటిన్నర ఎకరా మాత్రమే. ఫలితంగా చెత్త గుట్టలుగా మారిపోయాయి. ఈ క్రమంలోనే టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు తొలి ప్రాధాన్యతగా డంప్‌యార్డ్‌పైనే దృష్టిపెట్టారు.

పరిశీలించిన టీటీడీ ఈవో

తిరుమలలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లో తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గోగర్భం డ్యాంకు సమీపంలోని డంపింగ్‌యార్డ్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. లోపాలను గుర్తించి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. చెత్తను కుప్పగా వే సేందుకు కాంట్రాక్ట్ సంస్థలు ఎందుకంటూ ఆగ్రహించారు. చెత్త విభజనలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఇలా కొనసాగితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ చెత్త వల్ల దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై తిరుపతి మున్సిపాలిటీ అధికారులతో చర్చించామన్నారు. భవిష్యత్తులో శాస్త్రీయంగా డంపు చేసే విధానం అమలు చేస్తామన్నారు.



డంప్‌యార్డ్‌లో పేరుకున్న చెత్త



సినిమా చూస్తున్న గల్లా దంపతులు

సనాతన ధర్మం తెలిపే 'దేవకీనందన వాసుదేవ'

మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

తిరుపతి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన మనవడు అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' చిత్రం సనాతన ధర్మాన్ని తెలియజేసేలా ఉందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పేర్కొన్నారు. గల్లా అశోక్ హీరోగా నటించిన రెండో చిత్రం దేవకీనందన వాసుదేవ సినిమా శుక్రవారం విడుదలైంది. గల్లా అరుణకుమారి, ఆమె భర్త గల్లా రామచంద్రనాయుడు మధ్యాహ్నం కృష్ణతేజ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి తిలకించారు. మనవడి నటన ప్రావీణ్యాన్ని చూసి సంబరపడ్డారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అశోక్ హీరో కావడానికి చాలా కష్టపడ్డాడని, వెండితెరపై అద్భుతమైన నటనతో మరోసారి నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు చూడదగ్గ సినిమా అన్నారు. అంతకుముందు థియేటర్ వద్ద బాణసంచా పేల్చుతూ అభిమానులు వారికి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, గిరిజ, ఊకా విజయ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, మునినాదం, బాబ్జి తదితరులు సినిమా వీక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,803 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,930 మంది తలనీలాలు సమర్పించారు.

వెటర్నరీ వర్సిటీలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ

బీవీఎస్సీ కోర్సులో వందశాతం సీట్లతో భర్తీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నాలుగు బీవీఎస్సీ కాలేజీలు, 22 పాలిటెక్నిక్ కాలేజీలు, ఒక డెయిరీ డెక్నాలజీ కాలేజీల్లో ఖాళీగా ఉన్నట సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. బీవీఎస్సీకి సంబంధించిన 270 సీట్లు ఖాళీగా ఉండగా, 270 మందితో భర్తీ చేశారు. ఈ కోర్సుకు సుమారు 5 వేల మంది దరఖాస్తు చేశారు. అలాగే 10 ప్రభుత్వ, 12 ప్రైవేట్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 990 సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. ఈ కోర్సుల్లో 690 మంది విద్యార్థులు చేరారు. డెయిరీ టెక్నాలజీ కాలేజీలో ఖాళీగా ఉన్న 28 సీట్లకు 26 మంది విద్యార్థులు చేరారు. మార్చిలో ఎంవీఎస్సీ పీహెచ్‌డీ కోర్సులకు నోటిఫికేషన్ వెలువరించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ) చెంగల్రాయులు తెలిపారు.

తల్లీబిడ్డ అదృశ్యం

సత్యవేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుగుళంలో తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన మునిశేఖర్ భార్య హేమావతి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు ఇంటర్వ్యూకు వెళుతున్నానని చెప్పి తన కూతురు చిన్నారి నయనికను తీసుకుని గురువారం ఉదయం వెళ్లింది. రాత్రి ఇంటికి రాలేదు. మునిశేఖర్ బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తి కళాకారులు



ఢిల్లీ ప్రదర్శనలో సందర్శకులతో శ్రీకాళహస్తికి చెందిన హస్తకళాకారుడు గుమ్మడి దశరథాచారి

శ్రీకాళహస్తి, నవంబరు 22: ఢిల్లీలో శుక్రవారం ప్రారంభమైన ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు కళాకారులు పాల్గొంటున్నారు. కొయ్యబొమ్మల కళాకారుడు గుమ్మడిపూడి దశరథాచారి, కలంకారి కళాకారుడు సుధీర్‌లకు అవకాశం లభించింది. తోలు బొమ్మల కళాకారుడు కుళ్లాయప్పకు అవకాశం దక్కింది. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని క్రాఫ్ట్స్ మ్యూజియంలో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. కేంద్ర జౌళి శాఖ మంత్రి పవిత్రా మార్గరీటా శుక్రవారం దీన్ని ప్రారంభించారు. కొయ్యబొమ్మలు, కలంకారీ కళా ఉత్పత్తుల స్టాల్స్ ఇందులో ఏర్పాటు చేశారు. దేశ, విదేశీ కళాప్రియులు వీటిని సందర్శిస్తున్నారు. నిమ్మలకుంటకు చెందిన తోలుబొమ్మల కళాకారుడు కుళ్లాయప్ప కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

లెక్క తేలుతోంది..!

● 34 అపార్టుమెంట్లకు పన్నుల తగ్గింపు

● ఇష్టారాజ్యంగా టెండర్ల ప్రక్రియ

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాలను వెలికితీసే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంతో పాటు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొట్టారని ప్రాథమికంగా విచారణ కమిటీ గుర్తించింది. ఇదివరకు ఆడిట్ కమిటీ నిగ్గుతేల్చిన అంశాలే విచారణ కమిటీకి బ్రహ్మాస్త్రంగా మారినట్టు తెలుస్తోంది. మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఏ) విచారణకు సిద్ధమయ్యారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. వారం రోజులుగా కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్‌తో పాటు అకౌంటెంట్‌గా పనిచేసిన చిట్టిబాబులపై లోతైన విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. శనివారంతో విచారణ పూర్తిచేసుకుని మరో వారంలో నివేదిక సిద్ధ చేసేపనిలో విచారణ బృందం కసరత్తు చేస్తోంది. రెవెన్యూ, పరిపాలన వ్యవహారాల అంశాలలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్టు గుర్తించారు. టెండరుకు వెళ్లి చేయాల్సిన పనులు నామినేటెడ్ కింద ఇవ్వడం, అనర్హులకు కట్టబెట్టడం, బడ్జెట్ ఒకింత ఇస్తే రెండింతలు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టడం, లేని అధికారులు చెలాయించి దుర్వినియోగం చేయడం వంటివి విచారణ కమిటీ గుర్తించినట్టు తెలుస్తోంది. అదేవిధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిర్మాణాల కొలతలకు, రికార్డులో నమోదు చేసిన వాటికి చాలా వ్యత్యాసం ఉన్నట్టు సమాచారం. అడ్డగోలుగా కొలతలు తగ్గించడం, పార్కింగ్ వేయాల్సిన చోట వేయకుండా పన్నులు తగ్గించడం వంటివి బయటపడినట్టు తెలిసింది. దాదాపు 34 అపార్టుమెంట్లను పరిశీలిస్తే 250కు ఫ్లాట్లకు ఇష్టారాజ్యంగా పన్నులు తగ్గించి వేసినట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలోనూ గత డీజీ విజయకుమార్ రెడ్డిపై విచారణకు నియమితులైన పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు కార్పొరేషన్ కార్యాలయం నుంచి పలు రికార్డులు తెప్పించుకుని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చేయని పనులకు కూడా చేసినట్టు చూపించారని, కోట్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం

తిరుచానూరు, నవంబరు22, (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతిదేవి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈనెల 27న ఆలయంలో లక్ష కుంకుమార్చన జరగనుంది. 28న జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ఈ వేడుకలకు సంబంధించిన పనులను టీటీడీ అధికారులు వేగవంతం చేశారు.

వాహన సేవలు ఇలా..

28వ తేదీ: ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిన్నశేష వాహనం
29 : ఉదయం పెద్దశేషవాహనం, రాత్రి హంస వాహనం
30 : ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనం
డిసెంబరు 1 : ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం
2: ఉదయం పల్లకి ఉత్సవం, సాయంత్రం వసంతోత్సవం
3: ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గరుడ వాహనం
4: ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం
5: ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం
6: మధ్యాహ్నం పంచమీతీర్థం, రాత్రి ధ్వజావరోహణం
7: సాయంత్రం పుష్పయాగం.

సేవాభావంతో రైతులకు సేవలందించండి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది రైతులకు సేవాభావంతో సేవలందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు హెచ్చరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. రబీలో ఈ-పంట నమోదులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సాంకేతికత అధికారి హరిత వివరించారు. పంట, బీమా, పీఎం కిసాన్ గురించి సరళ, గాయత్రి సిబ్బందికి వివరించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్‌పై జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ వివరించారు. వరి సాగులో పరిమితంగా రసాయనాల వినియోగంపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధిపతి డాక్టర్ మురళీకృష్ణ రైతులకి శిక్షణ ఇచ్చారు. సిబ్బందితోపాటూ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కళాశాల ఆర్డినేటర్ భాస్కరయ్య, ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు వేణుగోపాలరావు, శ్రీనివాస్, శశికళ పాల్గొన్నారు.

ప్రహరీ కూలి ఒకరి మృతి

● ఐదుగురికి గాయాలు



గాయపడిన కూలీలు - మృతి చెందిన రానా

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర కాలనీ సమీపంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంలో ప్రహరీ గోడ కూలి ఒకరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సుధాకర్‌రెడ్డికి చెందిన స్థలంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇందులో ఒడిశా కూలీలు పనిచేస్తున్నారు. 15 అడుగుల గొయ్యి తవ్వి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. శుక్రవారం ఉదయం కూలీలు గోడ పక్కన ఇసుక పోస్తుండగా ప్రహరీ గోడ కూలిపోయింది. రాజు, రమేష్, చాన్‌బాబు, స్వాతినాయక్, సత్యనారాయణశర్మ, కొల్లాకరన్ రానాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కొల్లాకరన్ రానా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం



హావెల్స్-లాయిడ్ పరిశ్రమను సందర్శించిన జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన జాగృతి యాత్ర బృంద సభ్యులు 500 మంది శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఇందులో అమెరికా, యూరప్‌కు చెందిన 13 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారు. బృంద సభ్యులు రోల్ మోడల్‌గా ఎంచుకున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు రవీంద్ర సన్నారెడ్డి వివరణ ఇస్తూ శ్రీసిటీ ఏర్పాటు సమయంలో తాము ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను వీక్షించడంతో పాటు డైకిన్, హ్యావెల్స్, ఈప్యాక్, బాల్ కార్పొరేషన్, థెర్మాక్స్, మెక్‌విన్, జెడ్‌టీటీ, ఎంఎండీ, ఏఎల్ఎఫ్ ఇండియా, బెర్డిన్ ఫైప్స్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్స్, బ్రేక్స్ ఇండియా పరిశ్రమలను సందర్శించారు.

వ్యాసరాజ మఠాధిపతిని కలిసిన ఈవో



తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వ్యాసరాజ మఠాధిపతి విద్యాశ్రీశతీర్థ స్వామిజీని తిరుమలలో టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామిజీ ఈవో దంపతులకు ఆశీర్వచనం చేశారు. ఇటీవల భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని ఈవోను స్వామిజీ అభినందించారు.